వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 268 గురువారం | 02 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5






## అయ్యో... కవితకు మళ్లీ నిరాశే..!!

బెయిల్ పిటిషన్‌పై తీర్పు 6కు వాయిదా

# కాంగ్రెస్‌లో కోవర్టులు




వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచారం రోజు రోజుకూ జోరందుకుంటోంది. విజయమే లక్ష్యంగా అన్ని పార్టీల నాయకులు పావులు కదుపుతున్నారు. ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. అధిష్ఠానం ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ తమ పార్టీని గెలిపించాలంటూ వేడుకుంటున్నారు. మరో పది రోజుల్లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్‌లో కోవర్టుల కలకలం రేపుతోంది. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య వెంట ఉంటున్న క్యాడర్ ఇతర పార్టీ నేతలతో అంటకాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. పోటీలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు గతంలో ఒకే పార్టీకి చెందిన వారు కావడం.. వారే ప్రత్యర్థులుగా పోటీపడడంతో కోవర్టు రాజకీయాలు ఊపందుకున్నట్లు సమాచారం. క్యాడర్ సైతం ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ అటు నేనే.. ఇటు నేనే అంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించడమే లక్ష్యంగా పనిచేసిన వారంతా పార్టీ అధికారంలోకి రాగానే జెండాలు మార్చి ఖద్దర్ బట్టలు వేసుకొని వేదికలెక్కుతున్నారు. దీన్ని అసలు కాంగ్రెస్ వాదులు జీర్ణించుకోలేక పోతున్నారు. వారిపట్ల జాగరూకతతో వ్యవహరించాలని నిజమైన కాంగ్రెస్ వాదులు హెచ్చరిస్తున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..

**ఇతర పార్టీ నేతలతో అంటకాగుతున్న క్యాడర్**

**అంతా ఒకే పార్టీ వారు కావడంతో మొదటికే మోసం**

**హెచ్చరిస్తున్న నిజమైన కాంగ్రెస్ వాదులు**

**దొంగలు, మోసకారులను నమ్మొద్దంటూ హితవు**




## బీజేపీ పాలనలో దేశం సర్వనాశనం

లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడిద్దాం..

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య




ఎమ్మెల్సీ ఉపఎన్నికకు

## నోటిఫికేషన్

9 వరకు నామినేషన్ల స్వీకరణ




## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

# కాంగ్రెస్‌లో కోవర్టులు



**ఇతర పార్టీ నేతలతో అంటకాగుతున్న క్యాడర్**

**అంతా ఒకే పార్టీ వారు కావడంతో మొదటికే మోసం**

**హెచ్చరిస్తున్న నిజమైన కాంగ్రెస్ వాదులు**

**దొంగలు, మోసకారులను నమ్మొద్దంటూ హితవు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో విచిత్ర పోటీ నెలకొంది. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ ఎస్ ల మధ్యే నెలకొన్నా ముగ్గురు అభ్యర్థులు గతంలో ఒకే పార్టీకి చెందిన వారు కావడం గమనార్హం. అయితే ఇక్కడే అసలు సమస్య వచ్చి పడింది. బీఆర్ ఎస్ పార్టీకి చెందిన క్యాడరే అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలోను చేరడంతో అన్నీ ఒక తాను ముక్కలుగా మారింది. దీంతో ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ సొమ్ముచేసుకునే వారు ఎక్కువయ్యారు. తినేది మొగని సొమ్ము..పాడేది ఇంకొకరిలా ఉంది. ఎలక్షన్లు రాగానే కలెక్షన్లకోసం ఏదో చేసినట్లు ఫోజులిస్తూ ఇక్కడి సమాచారం అక్కడ లీక్ చేస్తూ అక్కడి సమాచారం ఇక్కడ అందిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తున్న కడియం కావ్యను ఆందోళనకు గురి చేస్తోంది.

## అవమానించిన వారే..

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించడమే లక్ష్యంగా పనిచేసిన వారంతా పార్టీ అధికారంలోకి రాగానే జెండాలు మార్చి ఖద్దర్ బట్టలు వేసుకొని వేదికలెక్కుతున్నారు. కాంగ్రెస్ పార్టీని అవమానించిన వారే నేడు ఆ పార్టీ అభ్యర్థి పక్షాన ప్రచారం చేయడంలో ముందున్నట్లు ఫోజులిస్తున్నారు. డీసీసీ, పీసీసీ, ఏఐసీసీ సభ్యులమంటూ పిలవకున్నా సన్నాహక సమావేశాలకు హాజరవుతూ నిజమైన లీడర్లకు కుర్చీ లేకుండా చేస్తున్నారు. జెండా మోసిన వారు వెనుక బెంచీలో ఉంటే మోసకార్లు మాత్రం ముందు వరుసలో దర్శనమిస్తున్నారు.



వరంగల్ వాయిస్, ఫైల్ ఫొటో..

## వారి చూపుకోసం..

అసెంబ్లీ ఎన్నికల్లో నాయిని రాజేందర్ రెడ్డి, కొండా సురేఖ గెలిచే అవకాశాలే లేవు, వారు అస్త్ర సన్యాసమే అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసిన వారే నేడు కడియం కావ్య ఎన్నికల ప్రచారంలో దర్శనమిస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి రానివారు సైతం నేడు తెల్ల చొక్కాలు ధరించి ఎలక్షన్ల గురించి మాట్లాడుతున్నారు. క్యాడర్ లేని అసమర్థులంతా నేడు కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టిలో పడేందుకు ఆరాటపడుతున్నారు.

## లోపాయికారి ఒప్పందం..

కాంగ్రెస్ పార్టీకి వీర విధేయులుగా ఉంటున్నట్లు, కడియం కావ్య విజయమే తమ లక్ష్యం అన్నట్లుగా నటిస్తూ ప్రత్యర్థి పార్టీ నాయకులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్, ఆయన ప్రధాన అనుచరులకు 'టచ్' లో ఉంటూ స్వలాభం చూసుకుంటున్నారు. ఎలక్షన్ లో ఎంతో కొంత రాకపోతుందా అనే నెపంతో ప్రచారాల్లో తిరిగినట్లు నటిస్తున్నారు.

## నయవంచకులు..

పార్టీ ద్రోహులు, నయవంచకులను చూసి అసలైన కాంగ్రెస్ వాదులు నిప్పులు చెరుగుతున్నారు. వారిపట్ల కాంగ్రెస్ పార్టీ కడియం కావ్యతోపాటు తూర్పు ఎమ్మెల్యే మంత్రి కొండా సురేఖ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జాగరూకతతో వ్యవహరించాలని నిజమైన కాంగ్రెస్ వాదులు హితవు పలుకుతున్నారు. దొంగలు, మోసకార్లను నమ్మి మోసపోవద్దంటున్నారు. పేపర్ పులుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. జంప్ జిలానీలు కొందరు సమావేశాలు మినహా ప్రచారంలో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారి, కడియం కావ్యకు మద్దతుగా ప్రజల్లోకి వెళ్లడంలేదని ఆరోపిస్తున్నారు. అభ్యర్థి తమ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోకి వచ్చినపుడు మాత్రమే వారి వెంట ఖద్దరు చొక్కాలు వేసుకొని హడావిడి చేస్తున్నారు తప్ప నిజంగా పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయడంలేదంటున్నారు.

## కుదరని సమన్వయం..

కాంగ్రెస్ నేతలకు, జంప్ జిలానీలకు మధ్య సమన్వయం కుదరడంలేదు. ఆ దిశగా ప్రయత్నాలు కూడా జరగడం లేదు. దీంతో ఒకే పార్టీలో ఉంటున్నప్పటికీ రెండు వేర్వేరు గ్రూపులుగా వ్యవహరిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కొంత గ్యాప్ కనిపిస్తోంది. ఇదే వరంగల్ తూర్పు, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశంలోనూ బహిర్గతమైంది. రెండు వర్గాలు కొట్టుకున్నంత పని చేశారు. పార్టీ కోసం మొదటినుంచి జెండాలు మోసిన వారిని కాదని హెలీక్యాప్టర్ మోడ్ లో వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడాన్ని నిజమైన కాంగ్రెస్ వాదులు ప్రతిఘటించారు. మంత్రి కొండా సురేఖ, పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య ఎదుటే ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇరు వర్గాలను నచ్చజెప్పేందుకు చేసిన ప్రయత్నాలు కూడా ఫలించ లేదు. దీంతో సదరు నాయకులు అసహనంతో అక్కడినుంచి వెళ్లి పోవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మే 13న జరగనున్న లోక్ సభ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం పరిధిలోని 254మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఓపివోలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండో విడత శిక్షణ కార్యక్రమం కొనసాగుతుండగా జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో, ఏపీవో, ఓపివోలను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ స్థానానికి మూడు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని పేర్కొన్నారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు కృషి చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, షేడ్ నెట్, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా పీఓలు, ఏపీవోలు, ఓపీవోలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమం గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శంకర్ కుమార్, పరకాల, గీసుకొండ తహసిల్దార్లు భాస్కర్, రియాజుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 5కె రన్‌ను విజయవంతం చేయాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓటరు చైతన్యంపై ఈ నెల 5న నిర్వహించనున్న 5కె రన్ లో విద్యార్థులు, యువత, మహిళలు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో 5కె రన్ కు సంబంధించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, హనుమకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు చంద్రశేఖర్ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటు కలిగిన ప్రతి ఓటరూ బాధ్యతగా ఓటు వేసేవిధంగా చైతన్యం తీసుకువచ్చేందుకే 5కె రన్ ను ఈ నెల 5వ తేదీ ఉదయం 6 గంటలకు హనుమకొండ జేఎన్ స్టేడియం నుంచి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5కె రన్ ను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

# ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి

**కేసీఆర్‌ను కోరిన ఉద్యమ నేత రాజ్ కిషోర్**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** విద్యార్థి ఉద్యమకారుడిగా 2001 నుంచి పార్టీలో పని చేస్తున్న తనకు వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని నీలం రాజ్ కిషోర్ మాజీ ముఖ్యమంత్రి బీఆర్ ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కోరారు. ఈ మేరకు తన బయోడాటాను ఆయనకు అందజేశారు. మిలియన్ మార్చ్, మహబూబాబాద్ కాల్పులు, రాయినిగూడెం సాగరహారం లాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నానని వివరించారు. ఆ నాటి మంత్రి సరయ్య మీద తిరుగుబాగు బాహుట ఎగురవేశానన్నారు. 2007 నుంచి మొన్నటి వరకు గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ స్థానాన్ని ఓసీ సామాజిక వర్గానికే కేటాయించారని గుర్తు చేశారు. ఈ ఉప ఎన్నికల్లో బీసీ బిడ్డ, విద్యార్థి ఉద్యమ కారుడిగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. టికెట్ ఇస్తే ఉద్యమకారులకు, విద్యార్థి నాయకులకు పార్టీలో సముచిత స్థానం కల్పించినట్లు అవుతుందన్నారు. ఇప్పటి వరకు పార్టీలో ఏ అవకాశం ఇవ్వనందున ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి యూ ట్యూబ్ బ్యాచ్ అయితే నేను ఉద్యమ బ్యాచ్ కు చెందిన వాడిని కనుక విజయావకాలు ఎక్కువగా తనకే ఉంటాయన్నారు. ఈ మేరకు కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్లు నీలం రాజ్ కిషోర్ చెప్పుకొచ్చారు.

## కావ్యకు మైనార్టీ నాయకుల మద్దతు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా. కడియం కావ్యను తెలంగాణ మైనార్టీ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అఖీల్ పాషా ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ అఖీల్ పాషా మాట్లాడుతూ దేశం మొత్తంలో కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తుందని, ఈ గాలిలో బీజేపీ పార్టీ కొట్టుకొని పోవటం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్ర మోడి మతి స్థిమితం కోల్పోయి ముస్లింలపై విషం కక్కుతున్నాడని, హిందువులను రెచ్చ గొట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి రెండు వందల డెబ్బై ఎంపీ సీట్లు చాలని, నాలుగు వందల ఎంపీ సీట్లు అడిగేది రాజ్యాంగాన్ని మార్చి ఎస్సీ , ఎస్టీ, ఓబీసీ, రిజర్వేషన్లు రద్దుచేయటానికే అని విమర్శించారు. గత పది సంవత్సరాలుగా అమిత్ షా ఎప్పుడు తెలంగానికి వచ్చిన మేము అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లను లేకుండా చేస్తారు. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ కడియం కావ్య కులంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని, హిందూ సాంప్రదాయం ప్రకారం బిడ్డకు తండ్రి కులమే వర్తిస్తుందన్నారు. కడియం కావ్య భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు. కడియం కవ్యను కలిసిన వారిలో తెలంగాణ మైనార్టీ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ మజహర్ హుస్సేన్, మహమ్మద్ అబిద్ నవాజ్, నూర్జహాన్ బేగం, అప్సరి బేగం తదితరులు ఉన్నారు.

## కూచన దామోదర్ మృతిపై మంత్రి కొండా సురేఖ సంతాపం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గం పెరుకవాడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కూచన దామోదర్ మృతి చెందడంతో మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. తన జీవితాంతం కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన దామోదర్ నిబద్ధత కాంగ్రెస్ పార్టీ యువ నాయకత్వానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. శోకతప్తులైన ఉన్న దామోదర్ కుటుంబ సభ్యులను మంత్రి సురేఖ ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ, కొండా కుటుంబం అన్ని వేళలా ఆదుకుంటుందని వారికి భరోసానిచ్చారు. మంత్రి సురేఖ వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులున్నారు.

## కావ్యకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ మద్దతు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఫార్వర్డ్ బ్లాక్ పోటీ చెయ్యని నియోజకవర్గాల్లో ఇండియా కూటమి అభ్యర్థులకు బలపరచాలనే రాష్ట్ర పార్టీ నిర్ణయంలో భాగంగా ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ ఇండియా కూటమి బలపరిచిన వరంగల్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు దారదత్తం చేస్తూ, బడా కార్పొరేట్ వ్యాపారస్తులు ఆదాని, అంబానీలకు దేశ ప్రజల సంపదను కట్టిపెట్టిన ఘనత మోడీ ప్రభుత్వానిదన్నారు. దళిత గిరిజన, ఓబీసీ, ముస్లిం మైనార్టీల హక్కుల రక్షణ కోసం భారత రాజ్యాంగ కాపాడుకోవడం కోసం వరంగల్ పార్లమెంట్ ప్రజలు ఇండియా కూటమి బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యకు తమ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో రోహిత్, ప్రవీణ్, పూర్ణ, సయ్యద్ మొహేన్, ఖాజా మియా, యూసఫ్, ప్రవీణ్ తదితరుల ఉన్నారు.

# నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

### సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్



**వరంగల్ వాయిస్, ములుగు :** లోక్ సభ ఎన్నికల విధులను ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా నిర్వహించాలని, పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థిని ఒకే తరహాలో చూడాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. గురువారం న్యూఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, సన్నద్ధతపై నిర్వహించిన వీడియో సమావేశంలో హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి పాల్గొనగా, ములుగు జిల్లా వీడియో కాన్ఫరెన్స్ సమావేశం హాలు నుంచి జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్, ఐటీడీఏ పీఓ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అదనపు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని పి.శ్రీజలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో పారదర్శకంగా విధులు నిర్వహించాలని, అందరినీ సమానంగా చూడాలని ఎవరి పట్ల పక్షపాతంతో వ్యవహరించడం చేయవద్దని తెలిపారు. ఎన్నికల విధులు భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పక్కాగా జరగాలని, ఎక్కడా ఏచిన్న పొరపాటు రాకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోటీలో ఎక్కువ మంది అభ్యర్థులు ఉన్న నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్లు చేరుకున్నాయని, ఈవీఎం బ్యాలెట్ యూనిట్ల ఎఫ్.ఎల్ సీ, ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని, హోమ్ ఓటింగ్ ప్రక్రియను నిబంధనల ప్రకారం మే 8 నాటికి పూర్తి చేయాలని, హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలను పోటీలో ఉన్న అభ్యర్థులకు తెలియజేయాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోఇప్పటివరకు 55 శాతం ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ చేశామని, మిగిలిన ఓటర్లకు సైతం పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో ఆర్డీఓ కె.సత్యపాల్ రెడ్డి, డీఎస్పీ రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశ శ్రేయస్సు బీజేపీతోనే సాధ్యం

### మాజీ జడ్పీటీసీ గోరంట్ల బలరాం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతో అభివృద్ధి జరగదని, దేశ శ్రేయస్సు బీజేపీతోనే సాధ్యమని దళిత దొర కడియం శ్రీహరి బిడ్డను కచ్చితంగా ఓడిస్తామని స్టేషన్ ఘనపూర్ మాజీ జడ్పీటీసీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు గోరింటాల బలరాం అన్నారు. గురువారం రఘునాథ్ పల్లి మండలం కాంచనపల్లి, నిడిగొండ గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో మరోసారి అధికారం చేపడితేనే భారతదేశం ఆర్థికంగా మూడో అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతుందని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్ కూడా దక్కదని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత బోజ్జపెల్లి సుభాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కావాటి ముత్యాలు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి మంద వెంకటేష్ యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పల వేణు, సీనియర్ నాయకులు గాజుల సంపత్, వల్ల ఉపేందర్, రంజిత్, ఆంజనేయులు, అమృతం శ్రీనివాస్, రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపల్లిలో మొదలైన ఉపాధి పనులు

### మంత్రి సీతక్కకు గ్రామస్థుల కృతజ్ఞతలు



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో ఎట్టకేలకు ఉపాధి హామీ పనులు తిరిగి మళ్లీ మొదలయ్యాయి. పనుల్లో భాగంగా ఎల్లారెడ్డిపల్లి గ్రామస్థులకు గ్రామంలోని వివిధ పరిసరాల్లో ఉపాధి పనులు చేపట్టాల్సి ఉండగా అధికారులు అందుకు విరుద్ధంగా వెంకటాపూర్ గ్రామంలోని ఓ చెరువు వద్ద పని కల్పించారు. ఈ క్రమంలో ఎల్లారెడ్డిపల్లి గ్రామస్థులు ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లేందుకు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వీరబోయిన మధుకర్ యాదవ్ బుధవారం మంత్రి సీతక్కను బుధవారం ములుగులో కలిసి ఉపాధి హామీ పని విషయాన్ని వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి సీతక్క ఫీల్డ్ అసిస్టెంట్ కు ఫోన్ చేసి ఎల్లారెడ్డిపల్లి గ్రామస్థులకు వారి ఊరిలోనే ఉపాధి హామీ పనులు చేపట్టాలని చూపించాలన్నారు. కాగా, మంత్రి ఆదేశాల మేరకు అధికారులు గురువారం ఎల్లారెడ్డిపల్లిలోనే ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపల్లి గ్రామస్థులు, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మోడీ ముందు చూపుతోనే దేశం అభివృద్ధి

### బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని డివిజన్ 56, 06, 05లలో ప్రచారం నిర్వహించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని వరంగల్ లోక్ సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాను అడగకున్నా అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఏకైక వ్యక్తి మన ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. అమృత్ పథకం ద్వారా వరంగల్ మహా నగరం రూపు రేఖలు మార్చుతున్నారు. వరంగల్ పట్టణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం కాజీపేట లో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటు కు ఆమోదం తెలిపారు. భద్రకాళి బండ్, వెయ్యి స్థంబాల గుడి మరమ్మతులు కూడా కేంద్ర ప్రభుత్వం నిధులతోనే చేయడం జరుగుతుందన్నారు. గ్రేటర్ వరంగల్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు కృషి చేస్తానని అరూరి హామీ ఇచ్చారు. మామునూరు ఏర్పాటు పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుడుతానని తెలిపారు. రామప్ప దేవాలయానికి యూనెస్కో గుర్తింపు రావడానికి మోడీ కృషి ఎంతగానో ఉందని కొనియాడారు. గ్రేటర్ వరంగల్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు పనులు పూర్తి చేసి రవాణా వ్యవస్థకు ఇబ్బందులు లేకుండా చేసిన ఘనత మోడీదని అన్నారు. కాంగ్రెస్ వారు గత పాలనలో వరంగల్ కు ఏమి చేశారో చెప్పి ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత ఆశయాల సాధనకు కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** విద్యార్థులు ఉన్నత ఆశయాలను ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2023 -24 పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజలతో కలిసి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఎంతో కీలకపాత్ర పోషిస్తుందని ఈ దశలోనే విద్యార్థులు తమ ఉన్నత జీవిత ఆశయాలను ఎంచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి దేశాన్ని ముందుకు నడిపించే మేధోసంపత్తిగా ఉండాలని, విద్యార్థులు ఉన్నత ప్రతిభను కనబరిచి వారి తల్లిదండ్రుల పేరును, ఉపాధ్యాయుల పేరు నిలబెట్టాలని అన్నారు. ఇంటర్మీడియట్ ఫలితాలలో ములుగు జిల్లాను మొదటి స్థానంలో నిలిపిన విద్యార్థిని, విద్యార్థులకు, ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ అభినందించారు. జిల్లా విద్యార్థిని, విద్యార్దులు భవిష్యత్తులో ఇదే జిల్లాలో ఒక కలెక్టర్ గా, ఎస్పీగా, ఉన్నతాధికారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో రాష్ట్రంలో రెండవ ర్యాంక్ సాధించిన టిఎస్ఆర్‌జేసీకి చెందిన పి.చరణ్ తేజ, రెండవ సంవత్సరం ఫలితాలలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిన ఆకుల ఆకాశ్, వీరితో పాటు ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులను , పదవ తరగతి ఫలితాలలో జిల్లాలో 10/10 ఉత్తీర్ణత సాధించిన 11మంది పదవ తరగతి విద్యార్థులకు , ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రం, మెమోంటో ప్రదానం చేసి శాలువ తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యాపల్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీఈఓ పాణిని, జిల్లా మైనారిటీ అధికారిని ప్రేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బలరాం నాయక్‌ను గెలిపిద్దాం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామంలో లోక్ సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవ రెడ్డి, మాజీ జడ్పీటీసీ హెచ్.వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ విచ్చేసి ఉపాధి హామీ పథకం లబ్ధిదారుల పని వద్ద కేంద్రంలో ప్రధాన మంత్రిగా రాహుల్ గాంధీ గెలిచిన వెంటనే దినసరి కూలీ రూ.400 వచ్చే విధంగా కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ ఇచ్చిందన్నారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యం రాజ్యాంగ హక్కులు కాపాడుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ గెలవాలని అన్నారు. మహబూబాబాద్ లోక్ సభ అభ్యర్థి బలరాం నాయక్ ను తప్పనిసరిగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు దేగల వెంకన్న, ఎంపీటీసీ వెల్ది గోవర్ధన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తూళ్ల నరేందర్, రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ తూళ్ల ప్రణయ్, తూళ్ల రామ్మూర్తి, యూత్ నాయకులు గడ్డమీది వేణు, విజేందర్, తూళ్ల వెంకన్న, యాకయ్య, రవి, శ్రీధర్, మధు, పిట్టల యాకయ్య, పూస అంజయ్య పాల్గొన్నారు.

## మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం గ్రామ ఎంపీటీసీ బుర్ర దీపా-దేవేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం ఉదయం వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా 150 మంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సక్కపల్లి ఎంపీటీసీ బుర్ర దీపా మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోడెపాక ఐలయ్య,నడికూడ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోడెపాక ప్రశాంత్, కోడెపాక ప్రమోద్ అమరేందర్, శ్రీనాథ్, బుర్ర సురేందర్, ముంజ విజేందర్, తలగంప్ప రవి, కేశిరెడ్డి రమణారెడ్డి, కిన్నెర మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తల ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ మున్సిపల్ పరిధిలోని భవాని నగర్ లో వరంగల్ లోక్ సభ ఎన్నికల ఇంచార్జి, పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలు పరకాల పట్టణ 9వ వార్డు 45వ బూత్ లో వరంగల్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య గెలుపు కోసం ఇంటింటి ప్రచారం చేశారు. గడపగడపకు ఐదు న్యాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 45వ బూతు ఇంచార్జి పావుశెట్టి వెంకటేశ్వర్లు, 9వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కౌన్సిలర్ దార్న వేణుగోపాల్, బూత్ కమిటీ సభ్యులు వెలదండి సురేష్, సిలువేరు చిరంజీవి, దార్న రిషి, వంగర పరమేష్, దొగేల్ల శ్రవణ్, కుమార్, కూచన శశికాంత, లక్ష్మీ, పావని, సునీత, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఆలయ కళ్యాణ మండపానికి విరాళం



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి వారి కళ్యాణ మండపం నిర్మాణం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ మహోత్సవంలో బీఆర్ఎస్ పార్టీ యువనేత సాంబారి సాయి కుమార్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తనవంతుగా రూ.5వేల విరాళం అందజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, అర్చకులు సాయికుమార్ శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గోరికొత్తపల్లి టౌన్ అధ్యక్షుడు రగుసాల తిరుపతి, గండ్ర యువసేన గోరి కొత్తపల్లి మండల అధ్యక్షుడు సుదనబోయిన సుమన్, రేగొండ మండల నాయకులు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కొందరు డబ్బులు అవసరాలకి ఇచ్చి అధిక వడ్డీలు వసూల్ చేస్తున్న వారిపైన పోలీస్ అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి పవన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కల్లూరి పవన్ మాట్లాడుతూ పేద ప్రజల అవసరం కోసం డబ్బులు ఇచ్చే వారి దగ్గర డబ్బులు తీసుకుంటే వాళ్ల అవసరం ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకా ప్రామిసరి నోట్ దగ్గర పెట్టుకొని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అధిక వడ్డీలతో చాలా మంది ఇబ్బందులు పడడమే కాక, ప్రాణాలు కూడా కోల్పోతున్నారన్నారు. కాబట్టి అధిక వడ్డీ వసూలు చేసే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ డిమాండ్ చేశారు.

## ఓటు హక్కు వినియోగంపై అవగాహన



**వరంగల్ వాయిస్, పరకాల :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు పరకాల బస్ స్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు తెలంగాణ సాంస్కృతిక సారథి పుట్ట జానకి బృందం కళాకారులు ఆట పాటలతో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్ వద్ద మానవ హారం ఏర్పాటు చేసి ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. 85 సంవత్సరాలు దాటిన వారికి ఇంటి వద్దనే ఓటు వేసే ఏర్పాటు చేయడం జరిగిందని, వయో వృద్ధులకు దివ్యాంగులకు వాహన సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు పొడగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస్ రావు, ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, ఏసీపీ కిషోర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ నరసింహ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజకుమారి, సీఐ రవిరాజ్, సీడీపీఓ భాగ్యలక్ష్మి, మండల పంచాయతీ అధికారి ఇమ్మడి భాస్కర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, మండల విద్యాశాఖ అధికారి రమాదేవి, ఏ.ఈ పంచాయతీ రాజ్ శ్రీలత, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ రమణ, ఏపీఎం క్రాంతి, ఏపీఓ ఇందిర, అంగన్వాడీ సూపర్ వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, మెప్మా ఆర్పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, మున్సిపల్ సిబ్బంది, పోలీసు అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు, తమ సిబ్బందితో సహా హాజరయ్యారు.

## నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీగా డాక్టర్ అనితా రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ది.నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ గా ఇప్పటి వరకు సేవలందించిన డాక్టర్ అనితా రెడ్డి ప్రమోషన్ పై నేషనల్ జాయింట్ సెక్రటరీగా ఎంపిక కాబడ్డారు. ఇక నుంచి నేషనల్ లెవల్ లో వినియోగదారులకు సేవలందించడం జరుగుతుంది. రాష్ట్ర స్థాయిలో డాక్టర్ అనితా రెడ్డి అందించిన సేవలను గుర్తించి నేషనల్ లెవల్ పదవిని అందించామని ది. నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్, నేషనల్ అడ్మిన్ చైర్మన్ రామానుజ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ నేషనల్ లెవల్ పదవి రావడం సంతోషంగా ఉందని, ఇక నుంచి నా సేవలను దేశ వ్యాప్తంగా విస్తరించే అవకాశం వచ్చిందన్నారు. దీంతో బాధ్యత మరింత పెరిగిందని, మరింతగా అవగాహన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని, వినియోగదారులు మోసపోకుండా చూడడమే లక్ష్యంగా పని చేస్తూ అవగాహన కార్యక్రమాలు విస్తరిస్తామని తెలిపారు. నేషనల్ జాయింట్ సెక్రటరీగా ఎంపిక చేసినందుకు ఫౌండర్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కడియం కావ్య గెలుపే లక్ష్యం



**వరంగల్ వాయిస్, దేశాయిపేట :** వరంగల్ లోక్ సభ ఎన్నికల్లో భాగంగా సేవాదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆదేశం మేరకు కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సుంకరి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల ఆదినారాయణ, వరంగల్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు నకిరేకంటి మోహన్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ అరుణ, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు కర్ణ అశోక్, దేవులపల్లి మోహన్, కరుణాకర్, గోదల కనకరాజు, మధు, సేవాదళ్ సంబంధించిన 20 మంది కార్యకర్తలు వరంగల్ నగరంలోని దేశాయిపేట వార్డుల్లో పర్యటించి కడియం కావ్య గెలుపు కోసం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గత పది సంవత్సరాలుగా ఈ దేశాన్ని పాలిస్తున్న మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వం ప్రకటించిన పాంచ్ న్యాయ్ లను ప్రజలకు తెలిపారు.

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ ఆధ్వర్యంలో కాటారం ఎక్సైజ్, భూపాలపల్లి డీటీఎఫ్ సిబ్బంది గురువారం మల్హర్ మండలంలోని అన్సాన్ పల్లి, నాచారం గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని 1950 లీటర్ల చెక్కర పానకాన్ని ధ్వంసం చేశారు. దాడులకు సంబంధించి నాలుగు కేసులు నమోదు చేసి అన్సాన్ పల్లి గ్రామానికి చెందిన లావుడియా తిరుపతిని అదుపులోకి తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో జిల్లా ఎక్సైజ్ అధికారి వి.శ్రీనివాస్, కాటారం ఎక్సైజ్ సీఐ నరేందర్, డీటీఫ్ సీఐ రాజ సమ్మయ్య, కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విస్తృత ప్రచారం



**వరంగల్ వాయిస్, నడికూడ :** వరంగల్ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రోజున కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి పరకాల శాసనసభ్యులురేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం చర్లపల్లి, వరి కోల్, నార్లాపూర్ ,వెంకటేశ్వర్ల పల్లి గ్రామాలలో నాలుగు క్లస్టర్ గ్రామాల ఇంచార్జిలు పాడి కల్పన ప్రతాపరెడ్డి ,పెద్దబోయిన రవీందర్ యాదవ్, చాడ తిరుపతి రెడ్డిల ఆధ్వర్యంలో గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని గ్యారంటీలను వివరిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో భాగంగా నార్లపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పదిమంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, ఆయా గ్రామాల గ్రామ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకు కాంగ్రెస్ శ్రేణులు



**వరంగల్ వాయిస్, నడికూడ :** రామకృష్ణాపురం, కంఠాత్మకూర్, ముస్తాలపల్లి, చౌటుపర్తి గ్రామాలల్లో వరంగల్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య చేతి గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని క్లస్టర్ ఇంచార్జిలు డా.కుడ్ల మలహాల్రావు, పేర్వాల భాస్కర్, ఈర్ల చిన్ని, మాజీ సర్పంచ్ ఉమా -సదానందం గ్రామాల్లో గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 గ్యారంటీలు మరియు ఇండియా కూటమి మేనిఫెస్టో ఐదు గ్యారెంటీ 25 సూత్రాల వివరిస్తూ రాహుల్ గాంధీ ని ప్రధాని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నా దేశ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉపసర్పంచ్ లు, బూత్ కమిటీ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన మీసాల ప్రకాశ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఓసిటీ క్యాంప్ ఆఫీసులో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, 27వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొగుళగాని రంజిత్, 27వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గూడ శారద లావణ్య తదితరులు కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజలకు ఎండ తీవ్రతపై అవగాహన కల్పించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో మహబూబాబాద్ జిల్లాను అగ్ర బాగాన ఉంచాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి కళావతి బాయి పేర్కొన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రానున్న రోజులలో ఎండల తీవ్రత 44 డిగ్రీల పైకి చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుపుతూ మహబూబాబాద్ జిల్లాలోని ప్రజలకు హీట్ వేవ్ పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్, జింక్ కార్నర్లను ఏర్పాటు చేయాలని, జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కార్మికుల పట్ల శ్రద్ధ వహించి ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. జాతీయ క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా రానున్న రోజులలో 18 సంవత్సరాల లోపు వయసున్న వారికి 18 కిలోల బరువు తక్కువగా ఉంటే బీసీజీ వ్యాక్సిన్ వేయవలసిన ఆవశ్యకత ఉందని, దానికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించాలన్నరు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో న్యూట్రిషనల్ రిహాబిటేషన్ సెంటర్ కు కావలసిన ఏర్పాట్లను చేయాలని, ప్రతి నెలలో జరిగే మీటింగ్లకు ఆశాలు, ప్రోగ్రాం అధికారులు విధిగా హాజరై తమకు సంబంధించిన కార్యక్రమాల అమలుపై విశ్లేషించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. మానసిక ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా ఉప కేంద్రం మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారిగా మానసిక ఆరోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి, జిల్లా జనరల్ హాస్పిటల్ లోని సైకియాట్రిస్ట్ డాక్టర్ వద్దకు రిఫర్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో సిజేరియన్ కాన్పుల శాతం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తపరుస్తూ తల్లుల సమావేశంలో నార్మల్ డెలివరీపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ వోలు డాక్టర్ అంబరీష, డాక్టర్ మురళీధర్, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ శ్రవణ్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీ రూ.600 చెల్లించాలి

### డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నకూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రూ.600 కూలీ చెల్లించడంతో పాటు 10 లక్షల రూపాయలతో కూలీ బీమా కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని శ్రీరాములపల్లి, అంబాల, నేరెళ్ల, లక్ష్మీపురం గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డీబీఎఫ్ నాయకులతో కలసి పరిశీలించగా పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు మొదలగు వసతులు కల్పించడం లేదని గిట్టుబాటు కూలి రావడం లేదని కూలీలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పక్క ప్రపంచవ్యాప్తంగా కార్మిక లోకం తమ హక్కులను సాధించుకొని మేడే వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నప్పటికీ దేశంలో అత్యధికంగా 70 కోట్లకు పైగా కార్మిక కుటుంబాలు ఆధారపడ్డ ఉపాధి హామీ పథకానికి కనీస వసతులు, సౌకర్యాలు కల్పించకుండా గత మూడేళ్లుగా సమ్మర్ అలవెన్స్ ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్నాయని మండిపడ్డారు. పని దినాల సంఖ్యను 200 రోజులకు పెంచాలని, గడ్డపార, పార తట్ట మొదలగు పనిముట్లను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని, వేసవి భత్యం 50 శాతం చెల్లించాలని, కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలని లేని పక్షంలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో దళిత, సామాజిక, ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల మద్దతుతో మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేపాక మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు పోరండ్ల అజయ్, జిల్లా కార్యదర్శి కొలిపాక రమేష్, కమలాపూర్ మండల అధ్యక్షుడు మోరే ఐలయ్యలతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు చిలువేరు బాలరాజు, కిరణ్ గౌడ్, మోహన్ రావు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ప్రతి రైలులో సాధారణ భోగీలను పెంచాలి

### ఆంధ్రాలో మొదలైన ఉద్యమం



**వరంగల్ వాయిస్, విజయనగరం :** ప్రతి రైలులో సాధారణ భోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని ఐదు సాధారణ భోగీల సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సాధన సమితి జాతీయ కన్వీనర్ తెలంగాణ వాసి, జాతీయ అవార్డు గ్రహీత-డాక్టర్ పరికిపండ్ల అశోక్ దేశవ్యాప్త ఉద్యమ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటి ఉత్తరాల కార్యక్రమం విజయనగరం జిల్లా కేంద్రంలో విశ్రాంత బ్యాంకు అధికారి తాటిచెర్ల పరమహంస అధ్యక్షతన కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని ఆర్కే డిగ్రీ కాలేజీ సెమినార్ హాల్ లో నిర్వహించారు. ఐదు సాధారణ భోగీల సాధన కోసం ప్రధానమంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాల గాంధీ మార్గంలో ఉద్యమాన్ని వివిధ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యం చేస్తూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు 80 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు అనధికార అంచనా ఉండగా, ఈ ప్రయాణంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా, ఆగమ్య గోచరంగా ఉంటుందని, డాక్టర్ అశోక్ పరికిపండ్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని భారతదేశంలోని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా -టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్, న్యూఢిల్లీ-110011. చిరునామాకు మన బాధను, డిమాండ్ ను అభిప్రాయాల్ని తెలుపుతూ ఉత్తరం రాసి పంపాలని కోరారు. వివరాలకు 9989310141లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, ఉపాధ్యాయ బృందం విజ్జి, రామ లీల,విద్యార్థిని విద్యార్థులు ఉత్తరాలు రాసి పోస్ట్ డబ్బాలో వేశారు.

## కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారం



**వరంగల్ వాయిస్, పరకాల :** గీసుగొండ మండలం ఎలుకుర్తి ఎంపీటీసీ పరిధిలోని ఎలుకుర్తి, ఆరెపల్లి గ్రామాల బూత్ స్థాయి కమిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఎలుకుర్తి గ్రామంలో, ఊకల్ ఎంపీటీసీ పరిధిలోని ఊకల్, మరియాపురం కొనాయమాకుల గ్రామాల కార్యకర్తల మీటింగ్ గురువారం కొనాయమాకుల గ్రామంలో నిర్వహించారు. ఈ మీటింగ్ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వరంగల్ లోక్ సభ నియోజకవర్గ ఇంచార్జి, పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు రైతు రుణమాఫీ చేస్తామన్నారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 5 న్యాయాలు, 25 పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. వరంగల్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించి లోక్ సభకు పంపిద్దామని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బూత్ లలో వచ్చిన మెజారిటీ కంటే, రెట్టింపు మెజారిటీ తీసుకు రావాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. పాత, కొత్త అనే విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ కష్టపడి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.

# మోడీ పాలనలో పేద వర్గాలకు మొండి చేయి

## ఆచార్య కూరపాటి వెంకట్ నారాయణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మోడీ పాలనలో 80 కోట్ల ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీ చేయడం అంటే 80 కోట్ల మంది నిరుపేదలుగా మిగిలిపోయి ఉన్నట్లేనని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఆందోళన చెందారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆచార్య వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత ధనవంతులైన కుబేరులు భారతదేశంలో వెలుగుతున్నారని, 80 కోట్ల పేద ప్రజలు ఆర్థిక సంక్షోభంలో చిక్కిపోయినారని, 30 కోట్ల యువకులు నిరుద్యోగులుగా మిగిలినారని, ఇందుకు మోడీ పాలన కారణం కాదా అని ప్రశ్నించారు. దేశంలోని 450 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు కేంద్ర నిధులు లేక పరిశోధన కుంటుపడిందని, విద్యార్థులకూ వసతి గృహ హాస్టల్స్ లేక నిర్వీర్యం అయిపోయాయని తెలిపారు. మోడీ పాలన కాలంలో దేశంలో వందలాది ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, వేలాది కార్పొరేట్ కళాశాలలు పేద ప్రజల రక్తాన్ని పీడించుకొని తింటూ ఉంటే, కేంద్రం కండ్లప్పగించి చూస్తూ ఉందని ఎద్దేవా చేశారు. గత పది సంవత్సరాల కాలంలో 8 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే కనీసం మద్దతు ధర కల్పించాలని ఢిల్లీ కేంద్రంగా ధర్నా చేసినప్పుడు 750 మంది పేద రైతులను పొట్టన పెట్టుకున్నారని, మోడీ రైతు పక్షాన నిలబడలేకపోయాడని అందుకే రాష్ట్రంలో మార్పు కోరినట్లే కేంద్రంలో కూడా దేశ ప్రజలు మార్చేందుకు సిద్ధమైనారని అందులో భాగంగా తెలంగాణ ప్రజలు కూడా ప్రభుత్వాన్ని మార్చే దిశలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించాలని విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా బడుగుల కుల గణన చేయని మోడీకి బై బై చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంద వీరస్వామి తెలంగాణ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు, బీసీ న్యాయవాదుల సంఘం నాయకులు, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, దయాల సుధాకర్, రాచకొండ ప్రవీణ్, చారి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా దువ్వ వీరేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు, నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు కాజీపేట ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దువ్వ వీరేష్ ను జిల్లా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ డిపార్ట్ మెంట్ కో ఆర్డినేటర్ గా నియమిస్తూ డీసీసీ ఓబీసీ డిపార్ట్మెంట్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ నియామక పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయిని రాజేందర్ రెడ్డి, బొమ్మతి విక్రమ్ చేతుల మీదుగా దువ్వ వీరేష్ అందుకున్నారు. ఈ సందర్భంగా దువ్వ వీరేష్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి హనుమకొండ జిల్లా ఓబీసీ డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్‌గా నియమించినందుకు పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, టీపీసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బొమ్మతి విక్రమ్ లకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ బాధ్యతతో ఒక క్రమశిక్షణ గల సైనికుడిలా పనిచేస్తూ హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడడానికి ఇపుడు జరుగుతున్న లోక్ సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు.


# పుట్ట మధు అనుచిత వ్యాఖ్యలు సరికాదు



**వరంగల్ వాయిస్, కాటారం :** మండల కేంద్రంలో లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాటారంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుపై పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాటారం మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ శ్రీధర్ బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసి మరోసారి తన నీచ రాజకీయాలను ప్రజలకు తెలియజేసేలా చేశారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో జాతారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమునురి ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, మహిళ మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, పీసీసీ ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న రమేష్ రెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షులు కొట్టే ప్రభాకర్, కడారి విక్రమ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గద్దల రమేష్, మాజీ సర్పంచులు కోడి రవికుమార్, రఘురాం నాయక్, మండల ప్రధాన కార్యదర్శి చీమల రాజు, తిరుపతి రెడ్డి, కొట్టే శ్రీహరి, మొగిలి రాజకుమార్ పాల్గొన్నారు.

# కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలి

## కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఈ నెల13న జరిగే వరంగల్ లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ పట్టణ కేంద్రంలోని బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 11, 12వ వార్డులలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఫాసిస్ట్ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, రెండు పార్టీలు కలసి దేశం, రాష్ట్రంలో ప్రజల మధ్య ద్వేషాన్ని రగిలించి దేశాన్ని మతాలు, కులాలు ప్రాంతాల వారీగా విభజించి పరిపాలన కొనసాగిస్తూ ప్రజల జీవితాలతో ఆడుకుంటూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాయని తెలిపారు. కుటుంబ నియంతృత్వ పరిపాలన సాగించిన కేసీఆర్ ను అసెంబ్లీ ఎన్నికలలో ఇంటికి సాగనంపినట్లే మతతత్వ బీజేపీ పార్టీని మే 13న జరిగే లోకసభ ఎన్నికలలో ఓడించి ఇంటికి పంపి, కాంగ్రెస్ పార్టీని ఆదరించి లౌకిక, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేలా ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ఈ దేశ అభివృద్ధి, సార్వభౌమత్వం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలిన గాంధీ వారసుడు, దేశ వ్యాప్తంగా ప్రాణాలకు తెగించి పాదయాత్ర ద్వారా దేశ ప్రజల కష్టాలను తెలుసుకొని తీర్చే ఆలోచన, ఔదార్యం వున్న రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలని, రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే తెలంగాణలో ఉన్న అన్ని పార్లమెంట్ సీట్లు గెలవాలన్నారు. వరంగల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కావ్యకు పాలకుర్తి నియోజకవర్గంలో 50 వేల పైగా మెజార్టీ వచ్చేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జీనుగా సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పెదగాని సోమయ్య, కౌన్సిలర్లు భూసాని రాము, దొంగరి రేవతి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్, యూత్ పట్టణ అధ్యక్షుడు మహేష్ యాదవ్, నాయకులు ధరావత్ సోమన్న, గంజి దేవేందర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, వెంకటాచారి, అలువాల సోమయ్య, దొంగరి శంకర్, బిజ్జాల అనిల్, వెంకన్న యాదవ్, రవి, రమేష్, వినోద్ కుమార్, జలగం వెంకన్న, కృష్ణమూర్తి, ప్రవీణ్ రెడ్డి, రోహిన్, మధు, మహేశ్వరి, రాణి, అనిత, యశోద తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో మృతి చెందిన ఉపాధి కూలీ కుటుంబాలకు ఎక్స్ గ్రేషియో చెల్లించాలి

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలకు పని ప్రదేశాలలో ఎండ వేడిమిని తట్టుకోవడానికి టెంట్లు, మంచినీరు మొదలైన కనీస ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైనందున తీవ్రమైన ఎండలకు ఉష్ణోగ్రతలు పెరిగి వడదెబ్బలకు గురై కూలీలుప్రాణాలు కోల్పోతున్నారని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో ఉపాధి కూలీ పనికి వెళ్లిన ఫకీరు మహమ్మద్ ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురై అపస్మారక స్థితిలో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లగా బుధవారం మృతిచెందడంతో ఆయన భార్య ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు అనాథలుగా మారారని నిరుపేదలైన కుటుంబానికి పెద్దదిక్కు లేకుండా పోయిందన్నారు. వడదెబ్బలకు, ప్రమాదవశాత్తు మరణించిన కూలీల కుటుంబాల వారికి రూ. 25 లక్షలు ఎక్స్ గ్రేసియో చెల్లించి అన్ని విధాల ఆదుకోవాలని వెంకట్రాములు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఓటర్ చైతన్య పోరాట యోధుడు

## ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి తాను త్రీ నగరిలో చేస్తున్న అవేర్నెస్ కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యానికి, కవులకు, కళాకారులకు, విద్యావంతులకు ప్రత్యక్షంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రముఖ సామాజికవేత్త, నిమ్మల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. తనను “ఓటరు చైతన్య పోరాటయోధుడు” అంటూ అభినందిస్తూ, మరింత ఉత్సాహాన్ని పెంచుతున్న ఎన్జీవో బాధ్యులకు గురువారం జరిగిన ఒక సమావేశంలో ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 12 వరకు తన కార్యక్రమాలు కొనసాగుతాయని ప్రజలంతా ముఖ్యంగా విద్యార్థులు, విద్యావంతులైన పట్టణ ప్రజలు ఈనెల 13న జరిగే లోక్ సభ ఎలక్షన్లలో తప్పక వారి అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సహకరిస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల ఇళ్ల స్థలాలలో అక్రమ నిర్మాణాలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కడిపికొండ రెవెన్యూ గ్రామం శివారులో 10 సంవత్సరాల క్రితం ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు సర్వేనెంబర్ 46లో ఇవ్వడం జరిగింది. ఈ సర్వే నెంబర్లలో కొంత గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ నిర్మాణాలు కడుతున్నారనీ బీజేపీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం ఆరోపించారు. దీనికి సంబంధించి స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను, తహసీల్దార్, సీఐను కలిసి అక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాల గురించి తెలియజేయగా, దీనిపై వారు సానుకూలంగా స్పందించి గురువారం ఉదయం అక్రమ నిర్మాణానికి నోటీసులను అందజేశారన్నారు. ఇలాంటి నిర్మాణాల పై ప్రభుత్వం చట్టపరమైన శిక్షలు విధించాలని కోరుకుంటున్నానని అన్నారు. 46వ సర్వే నెంబర్లో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే చూస్తూ ఊరుకోమనీ, ప్రత్యక్షంగా చర్యలకు పాల్పడతామనీ, ప్రభుత్వ భూమిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మసీదులు కట్టరాదని తెలిసి కూడా ఆర్థిక, అంగ బలంతో కొంతమంది జిల్లా అధికారులు పరోక్షంగా, ప్రత్యక్షంగా ఒక వర్గానికి మద్దతు పలకడం చాలా దారుణమన్నారు. వారికి నేను చెప్పేది ఒకటే మీరు ఒక వర్గానికి మద్దతు తెలిపితే భవిష్యత్తులో జరిగే ప్రతి చర్యలకు మీరే బాధ్యత వహిస్తారు. గతంలో కూడా ఈ సర్వే నెంబర్లో చర్చి నిర్మాణం జరిగిందనీ, దీనికి సంబంధించి టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను కూలగొట్టాలని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మున్సిపల్ డిపార్ట్ మెంట్ వారు మర్చిపోయుంటారు. దాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని అక్రమ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా కూలగొట్టాలని అధికారులను కోరుకుంటున్నానని మాజీ కార్పొరేటర్, బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు నార్లగిరి రామలింగం డిమాండ్ చేశారు.

# టిల్లూ క్యూబ్‌లో పూజా హెగ్డే



అగ్ర కథానాయిక పూజాహెగ్డేకు గత కొంతకాలంగా అదృష్టం కలిసి రావడం లేదు. వరుస పరాజయాలతో ఈ భామ కెరీర్ సాగుతున్నది. ప్రస్తుతం సినిమాలకు కాస్త బ్రేక్‌నిచ్చి కుటుంబ సభ్యులతో విరామ సమయాల్ని గడుపుతున్నది. తాజా సమాచారం ప్రకారం తెలుగు ఇండస్ట్రీ నుంచి ఈ అమ్మడు ఓ గుడ్‌న్యూస్‌ను అందుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..టిల్లు, టిల్లు స్వేర్ చిత్రాలు యువతరంలో మంచి ఆదరణ దక్కించుకున్నాయి. టిల్లు పాత్రలో హీరో సిద్ధు జొన్నలగడ్డ తనదైన మేనరిజమ్స్, హైదరాబాదీ కామెడీతో ఆకట్టుకున్నారు. ఈ రెండు చిత్రాలకు కొనసాగింపుగా 'టిల్లు క్యూబ్' తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో కథానాయికగా పూజాహెగ్డేను ఎంపిక చేసినట్లు తెలిసింది. డీజే టిల్లు, టిల్లు స్వేర్ చిత్రాల్లో కథానాయిక పాత్రలకు చాలా ప్రాధాన్యత ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడో భాగంలో పూజహెగ్డేను కథానాయికగా తీసుకోబోతున్నారని వార్తలొస్తున్నాయి. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.







## రేపు విడుదలవుతున్న ఆ ఒక్కటీ అడక్కు

అల్లరి నరేశ్  హీరోగా మల్లి అంకం తెరకెక్కించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'  ఫరియా అబ్దుల్లా కథానాయిక. వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా మే 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈసందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడివి శేష్ అతిథిగా హాజరయ్యారు. 'డైరెక్టర్‌గా మల్లికి ఇది తొలి సినిమా. నేను ఇప్పటివరకు 32మంది దర్శకులతో వర్క్ చేశాను. వాళ్లందరూ రిలీజ్‌కు ముందు ఒత్తిడి గురయ్యేవారు. కానీ, మల్లి మాత్రం నవ్వుతూ ఉన్నారు. అలా ఉండడం చాలా గ్రేట్. నిర్మాత ఖర్చు విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. ఫరియా అబ్దుల్లాతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఆమె ఉన్నత స్థానాలకు వెళ్లాలి. 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమా అందరినీ నవ్విస్తుంది. పెళ్లికాని వాళ్లు, సంబంధాలు వెతుకుతున్న వాళ్లు అందరూ ఈ చిత్రం చూడాలి. పెళ్లి పేరుతో జరుగుతోన్న మోసాలను ఇందులో చూపించాం. మీ అందరూ కూడా తెలుసుకోవాలి. మే3 థియేటర్‌కు వచ్చి సినిమా చూసి ఎంజాయ్ చేయండి' అని అల్లరి నరేశ్ కోరారు. అడివి శేష్ మాట్లాడుతూ..'నరేశ్ నాకు మంచి ఫ్రెండ్. నా మొదటి సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయనే గెస్ట్‌గా వచ్చారు. నరేశ్ అంటే నాకు ఇంట్లో వాళ్లతో సమానం. ఫరియా అబ్దుల్లా మంచి అమ్మాయి. ఈ చిత్రబృందంలో చాలామంది నా కెరీర్ ప్రారంభంలో సపోర్ట్ చేశారు. అందుకే ఈ సినిమా నాకూ ప్రత్యేకమైనది. ఈ చిత్రం ప్రేక్షకాదరణ సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు.




# బీజేపీ పాలనలో దేశం సర్వనాశనం

**లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడిద్దాం..**
**రాజ్యాంగాన్ని కాపాడుకుందాం**
**కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీజేపీ పదేండ్ల పాలనలో దేశం సర్వనాశనమైందని, లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య పిలుపునిచ్చారు. హనుమకొండ రాయపురలో ముస్లిం మేధావులతో గురువారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ కడియం కావ్యతోపాటు స్టేషన్ ఘన్ పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొనారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ..పార్లమెంట్ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతున్న పోరుగా అభివర్ణించారు. దేశాన్ని ఏకం చేసిన కాంగ్రెస్ ఒక వైపు ఉంటే ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తున్న బీజేపీ మరోవైపు ఉందన్నారు. నేడు దేశం అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఉందన్నారు. మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ముస్లిం, క్రిస్టియన్, దళిత వ్యతిరేకి అయిన బీజేపీ రిజర్వేషన్లు తీసివేసే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. దేశ ప్రజలు స్వేచ్ఛగా ఉండాలంటే అంటే అది ఒక్క కాంగ్రెస్ తోనేసాధ్యమన్నారు. ఇక్కడి ప్రతి సమస్యపై నేను మీకు అండగా ఉండి పోరాడుతానన్నారు. లోక్ సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కడియం కావ్య కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



### పర్వతగిరిలో..

వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండల కేంద్రంలోని జేఆర్ ఆర్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన పర్వతగిరి మండల బూత్ కమిటీ, మండల విస్తృత స్థాయి సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ నా మండలం, నా ఊరు పర్వతగిరి అన్నారు. ఎంపీగా ఆశీర్వదిస్తే పర్వతగిరి మండలాన్ని దత్తత తీసుకుంటానన్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెస్తానన్నారు. మీకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ మీ కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

తెలంగాణ రాష్ట్ర, ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హాసన్ పర్తి ఎర్రగట్టు వద్దగల కేఎల్ ఎన్ కన్వెన్షన్ హాల్లో తెలంగాణ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి రెడ్డి కృతజ్ఞత సభలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ రెడ్డి సంక్షేమనికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద పీట వేస్తున్నారన్నారు. అగ్రవర్ణాలలో ఉన్న పేదలకు కూడ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే రెడ్డి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. అవినీతికి కేరఫ్ అడ్రస్ అరూరి రమేష్ అని దుయ్యబట్టారు. ఆయనకు ఓటు వేస్తే మన భూములు రాసిఇచ్చినట్లే నన్నారు. మీ ఇంటి బిడ్డగా నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అయ్యో... కవితకు మళ్లీ నిరాశే..!!

**బెయిల్ పిటిషన్‌పై తీర్పు 6కు వాయిదా**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. సీబీఐ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పును మే 6కి వాయిదా వేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పును మే 6న వెలువరిస్తామని జడ్జి కావేరి బవేజా ప్రకటించారు. కాగా ఇదివరకే కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా పడింది. ఏప్రిల్ 22న తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. దీంతో గురువారం జైలా..బెయిలా అనేది తేలుతుందని అంతా భావించారు. కాని కవితను నిరాశకు గురిచేస్తూ తీర్పును మరోసారి కోర్టు వాయిదా వేసింది. మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలని, అరెస్ట్ నుంచి విచారణ వరకు కవితకు వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవని వాదనలు కవిత తరపు న్యాయవాదులు వినిపించారు. బీఆర్ఎస్ పార్టీకి స్టార్ క్యాంపైనర్‌గా ఉన్నందున ఎన్నికల్లో ప్రచారం కోసం బెయిల్ ఇవ్వాలని కవిత కోరారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులకు అరెస్ట్ అవసరం లేదని, కవిత అరెస్టుకు సరైన కారణాలు లేవని, మహిళగా ఆరోగ్యపరమైన కారణాలు పరిగణలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలని కవిత న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. లిక్కర్ కేసులో కవిత కీలక వ్యక్తిగా ఉన్నారని సీబీఐ తరపు లాయర్లు వాదించారు. ఈ కేసుకు సంబంధించి చాలా విషయాలు కవితకు తెలుసునని, ఇతరులు ఇచ్చిన స్టేట్‌మెంట్స్, ఆధారాలపై ఆమెను విచారించినా నిజాలు చెప్పడం లేదని కోర్టుకు సీబీఐ న్యాయవాదులు తెలిపారు. హై పొలిటికల్ పవర్ ఉన్న కవిత ఈ కేసు దర్యాప్తును, ఆధారాలు, సాక్ష్యాలను ప్రభావితం చేయగలరని బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ వాదించింది. ఇంతకు ముందు ఎక్సైజ్ పాలసీ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 7వ తేదీ వరకు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పునిచ్చింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవితను మార్చి 15న ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

# ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్

**9 వరకు నామినేషన్ల స్వీకరణ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 9 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. మే 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈ నెల 27న పోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జూన్ 5న ఓట్లు లెక్కించనున్నారు. అయితే గత ఎన్నికల్లో ఎమ్మెల్సీగా విజయం సాధించిన పల్లా రాజేశ్వర్ రెడ్డి గతేడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈనేపథ్యంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైంది. కాగా, ఈ నియోజకవర్గం పరిధిలో 4,61,806 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ ఉపఎన్నికకు నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిని ఎన్నికల అధికారిగా ఈసీ నియమించింది. అభ్యర్థులు నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది.




# రేపు ఆర్ట్స్ కళాశాలలో.. ఓటర్ అవగాహన కార్యక్రమం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, వరంగల్, హనుమకొండ కాన్సెన్సీ జిల్లా స్వాప్-2024 ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఆడిటోరియంలో ఓటర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ తాటికొండ రమేష్, గౌరవ అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్టర్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, డీఆర్ డీఏ నోడల్ ఆఫీసర్ నాగ పద్మజ, ఎం.శ్రీనివాసరావు, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.మధురిమ, కన్వీనర్ డాక్టర్ రమేష్ పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com